'జేఈఈ మెయిన్స్'లో ఎస్ఆర్ ప్రభంజనం

- అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు
- అభినందించిన చైర్మన్ వరదారెడ్డి

5



డి.మహేష్ (99.99 శాతం)



టి.తేజస్వి (99.95 శాతం)



మండప పునర్నిర్మాణ చిత్రాలను తిలకిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

వేయిస్తంభాలగుడి కల్యాణ మండప పునర్నిర్మాణం అద్భుతం

- త్వరలో భక్తులకు అంకితం
- రూ.60కోట్లతో రామప్ప వద్ద వసతులు
- ఈ ఏడాది నుంచి గిరిజన యూనివర్సిటీ తరగతులు
- వర్సిటీపై అవగాహనకు మేడారం జాతరలో స్టాల్ ఏర్పాటు
- కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం సందర్శన

హనుమకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చరిత్రాత్మకమైన హనుమకొండలోని రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాలగుడి కల్యాణమండప పునర్నిర్మాణం ఓ అద్భుతమని, త్వరలోనే పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు అంకితం చేస్తామని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం వేయిస్తంభాల గుడి ఆవరణలోని కల్యాణ మండపాన్ని సందర్శించిన ఆయన మండపాన్ని యథాతథంగా తిరిగి నిర్మించడం గురించి కేంద్ర పురావస్తుశాఖ అధికారుల ద్వారా తెలుసుకున్న ఆయన శిల్పుల నైపుణ్యాన్ని ప్రశంసించారు. స్థపతి శివకుమార్‌తో కలిసి మండపాన్ని సందర్శించిన ఆయన తొలుత ఆలయ ప్రాంగణంలో మండప పునర్నిర్మాణంపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించి.. అనంతరం మీడియాతో మాట్లాడారు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి చెక్కడం ద్వారా మండపానికి పూర్వ వైభవం తీసుకువచ్చారన్నారు. తెలంగాణలోని ప్రాచీన కట్టడాల మరమ్మతులు, పునర్నిర్మాణానికి కేంద్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపునకు కృషి చేసిందని, రామప్ప ప్రాంగణంలో రూ.60కోట్లతో పర్యాటకులకు వసతులు కల్పిస్తున్నామన్నారు. వరంగల్ కోటలో దృశ్య శ్రవణ (పసాద్) ఏర్పాట్లు పూర్తయ్యాయని, గిరిజన పర్యాటక ప్రాజెక్టు కింద ఏజెన్సీ ప్రాంతాల్లో రూ.90కోట్లతో అతిథి గృహాలు, చెరువుల్లో బోట్లు, ఇతర వినోద ఏర్పాట్లు చేస్తోందని వివరించారు. త్వరలో

మిగతా 4వ పేజీలో..

మేడిగడ్డపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

- లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ లబ్ధికి ప్రయత్నాలు
- బీజేపీ పార్లమెంట్ కార్యాలయ ప్రారంభోత్సవంలో కిషన్‌రెడ్డి

వివరాలు : 4లో..

మేడిగడ్డ.. 'లక్ష' అబద్ధాల పుట్ట!



- రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరివ్వలేదు
- ముంపుపై 2020లోనే నిర్మాణ సంస్థకు లేఖలు రాసినా పట్టింపు లేదు
- మేడిగడ్డ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి బ్యారేజీ సందర్శన
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర మండిపాటు

కోటి ఎకరాలకు నీళ్లిచ్చామన్నది బూటకం

పిల్లర్ పగుళ్లను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు



భారీగా పగుళ్లు ఏర్పడిన మేడిగడ్డ బ్యారేజీ 21వ పిల్లర్

వరంగల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడిగడ్డ లక్ష అబద్ధాల పుట్ట అని, రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో కోటి ఎకరాలకు నీరందించామని కేసీఆర్ చెప్పిన మాటలు పచ్చి బూటకమని, ఆయన గొప్పలు చెప్పుకొన్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నీటి పారుదలశాఖ, విజిలెన్స్ అధికారులు ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో పాల్గొన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలను ప్రజల ముందు ఉంచేందుకు మేడిగడ్డ పర్యటన చేపట్టామని, లక్ష కోట్లు ఖర్చు చేసి కనీసం లక్ష ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని, కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు రూ.94వేల కోట్లు ఖర్చు పెట్టారని కేవలం 98వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు మాత్రమే నీరు ఇచ్చారని వివరించారు. ఏటా కరెంట్ బిల్లులకే రూ.10,500కోట్లు ఖర్చవుతుందని, రుణాలు ప్రాజెక్టుల నిర్వహణకు ఇతర ఖర్చులకు సుమారు రూ.25వేల కోట్లు ఖర్చు అవుతుందని, మొత్తం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.2లక్షల కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. 2020లోనే ఈ బ్యారేజీకి ముంపు ఉందని ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ సంస్థ అయిన ఎల్‌అండ్‌టీకి లేఖ రాశారని అయినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వరుసగా 2021, 2022, 2023లో మేడిగడ్డ బ్యారేజీలో ఎదురైన సమస్యలపైనా హెచ్చరించినా పట్టించుకోపకపోవడంవల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. మేడిగడ్డ అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఒకేరకమైన టెక్నాలజీతో నిర్మించారని, భవిష్యత్తులో వీటికి కూడా ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉందన్నారు. మూడేళ్లలో నిర్మించడం, 8 ఏళ్లలో కూలిపోవడం ప్రాజెక్టు డిజైన్ లోపమేనని, ప్రజాధనాన్ని వృథా చేశారని మండిపడ్డారు.

అన్ని పాపాలకు కారణం కేసీఆరే..

స్వార్థం కోసం కాకుండా.. ఒక్కసారైనా ప్రజలకు మేలు జరిగేలా ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యత నెరవేర్చాలని మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లకు పగుళ్లు స్పష్టంగా కనిపిస్తున్నా దానిని చిన్న సంఘటనగా కేసీఆర్ చెప్పడం బాధాకరమన్నారు. అన్ని పాపాలకు కేసీఆరే కారణమని, తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకొనేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని, ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై మీ వైఖరేంటో శాసనసభలో చెప్పాలని రేవంత్‌రెడ్డి కోరారు. కాళేశ్వరం అవినీతిపై చర్చకు రాకుండా కేసీఆర్ నల్లగొండలో సభ పెట్టుకున్నాడని, కేసీఆర్ కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కేసీఆర్ కాళేశ్వరానికే కాదు.. ఇక కాశీకి వెళ్లి సన్యాసం పుచ్చుకోవాల్సిందేనని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఇంకా ఎన్నాళ్లు చీకటి పొత్తు పెట్టుకుంటారని ప్రశ్నించారు. మేడిగడ్డ సందర్శనకు బీజేపీ ఎమ్మెల్యేలు వస్తారని అనుకున్నామని, చివరి నిమిషంలో కిషన్‌రెడ్డి ఒత్తిడితో వెనక్కి తగ్గారని ఆరోపించారు.





సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కేసీఆర్ అవినీతికి బీజేపీ నేతలు సహకరిస్తారో.. అవినీతిపై విచారణ చేసే మా ప్రభుత్వానికి సహకరిస్తారో చెప్పాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

దేశంలోనే కాళేశ్వరం భారీ స్కామ్ : మంత్రి ఉత్తమ్

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలోనే జరిగిన భారీ కుంభకోణం కాళేశ్వరంలోనే జరిగిందని భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రూ.38వేల కోట్ల ప్రాజెక్టును రీడిజైనింగ్ పేరుతో రూ. 94వేల కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. ప్రాజెక్టు కోసం ఇంకా రూ. 34 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రాజెక్టును కట్టారని ఆరోపించారు. బ్యారేజీని కట్టి నీటిని నిల్వ చేసి ఎన్నికల ముందు పబ్లిసిటీ చేసుకున్నారని ఆరోపించారు. ఇది భారీ కుంభకోణమని, క్రిమినల్ చర్యలు కూడా తీసుకునేందుకు క్యాబినేట్‌లో చర్చిస్తామన్నారు. అక్టోబరు 21న

మిగతా 5వ పేజీలో..

ఎస్సెస్సీలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- జడ్పీ సీఈవో రమాదేవి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13 : మార్చిలో ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక ఫలితాల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా పరిషత్ సీఈవో రమాదేవి సూచించారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్సెస్సీ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. ఉదయం, సాయంత్రం కొనసాగుతున్న ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు ఎలాంటి సందేహాలున్నా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు.విద్యార్థులు రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రత్యేకదృష్టి సారించాలని సూచించారు. పరీక్షాసమయం సమీపిస్తున్నందున టీవీ, సెల్‌ఫోన్‌లను చూడకుండా చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి రామారావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. పరీక్షకు హాజరైన ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10/10 జీపీఏ ఎక్కువ మంది విద్యార్థులు సాధించే విధంగా చూడాలన్నారు.

ఈ అవగాహన సదస్సులో ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఏఎంవో ఆజాద్‌చంద్రశేఖర్, ఆర్పీలు తండ హరీష్, తండ సదానందం, జి.శ్రీనివాస్, డి.హుస్సేన్, రవి కుమార్, వీరయ్య, హెచ్ఎం వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రసాదరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

13 మంది ఏసీపీల బదిలీ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో స్థానచలనం

6లో..

మానుకోట మునిసిపల్ వార్షిక బడ్జెట్ రూ.34.20 కోట్లు

ఏకగ్రీవంగా ఆమోదించిన పాలక మండలి



మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 13 : మానుకోట మునిసిపల్ 2024-25 వార్షిక అంచనా బడ్జెట్‌ను రూ.34.20 కోట్లతో పాలకమండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. జూనియర్ అకౌంట్ ఆఫీసర్ (జేఏవో) శ్రీదేవి వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను చదివి, విన్పించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇంటిపన్నులు, స్టాంప్‌డ్యూటీ ద్వారా రూ.5.35కోట్లు, పన్నుయేతర, అద్దెల ద్వారా ఆదాయం 12.31కోట్లు, డిపాజిట్ల ద్వారా రూ.1.85కోట్లు, ప్లాన్, నాన్ ప్లాన్, ఇతర నిధుల ద్వారా రూ.14.69 కోట్లు మొత్తంగా రూ.34.20 కోట్ల నిధులు సమకూరుతాయని అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. ఇక వ్యయ విషయానికి వస్తే వేతనాలు, పారిశుధ్య నిర్వహణ వ్యయం, విద్యుత్ చార్జీలు, రుణాల చెల్లింపు లాంటి వాటికి రూ.11.94 కోట్లు, ఇతర నిర్వహణ, సాధారణపరిపాలన వ్యయం, పట్టణ ప్రణాళిక విభాగం ఖర్చు రూ.3.27కోట్లు, అభివృద్ధి పనుల వ్యయం రూ.19.14 కోట్లు, ఇతరత్రా కలిపి మొత్తంగా రూ.31.41 కోట్లు ఖర్చు చేయనున్నట్లు బడ్జెట్‌లో పొందుపర్చారు. 2024-25 ఆర్థిక సంవత్సరఅంచనా బడ్జెట్‌ను పాలకమండలి ఏకగ్రీవంగా ఆమోదించింది.

ప్రజా సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు..

మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశ ఆరంభంలో ప్రజాసమస్యలపై పలువురు కౌన్సిలర్లు గళమెత్తారు. తొలుత మహిళా కౌన్సిలర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కోఆప్షన్ సభ్యురాలు అనితారాణి ఏడాది కాలంగా సమావేశానికి హాజరు కాకుండా వేతనం ఎలా తీసుకుంటున్నారని అధికారులను ప్రశ్నించారు. వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనేలైట్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు దండెబోయిన బుజ్జి వెంకన్న, మార్నేని శ్రీదేవి సమావేశ దృష్టికి తీసుకువచ్చారు. బ్యాంక్ కాలనీలోని 554 గజాల గ్రీన్‌ల్యాండ్ రక్షణ కోసం పోరాడుతుంటే తమపై పోలీసు కేసులు పెడుతున్న మునిసిపల్ అధికారులు ఎందుకు మిన్నకుండి పోతున్నారని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి ధ్వజమెత్తారు. మునిసిపల్ అధికారుల తీరును ఎండగడుతూ పోడియం వద్ద సీపీఐ కౌన్సిలర్లు కాసేపు బైఠాయించారు. వీరికి మద్దతుగా సీపీఎం ఫ్లోర్ లీడర్ సోమయ్య, కౌన్సిలర్లు మార్నేని వెంకన్న, ఎడ్ల వేణు మద్దతుగా మాట్లాడారు. స్పందించిన చైర్మన్ రాంమోహన్‌రెడ్డి తక్షణమే గ్రీన్‌ల్యాండ్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఎవరైనా అడ్డుకుంటే వారిపై పోలీసు కేసు పెట్టాలని అధికారులను ఆదేశించారు. తొలుత మానుకోట ఉప సర్పంచ్‌గా పని చేసిన రచ్చ మహేశ్వరరావు మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఎమ్డీ.ఫరీద్, కమిషనర్ ప్రసన్నారాణి, డీఈ ఉపేందర్, ఏఈ సురేష్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, కౌన్సిలర్లు ఇందిర, హరిసింగ్, సలీం, పోతురాజు రాజు, యాళ్ల పుష్పలత, పద్మ, సునిత, గుండా స్వప్న, స్వాతి, కోడి నాగలక్ష్మి, నీరజ పాల్గొన్నారు.

బంజారాల ఆరాధ్యదైవం.. సంత్ సేవాలాల్ మహారాజ్



- ప్రభుత్వ ఆప్షన్ హాలిడేతో గిరిజనుల్లో హర్షం
- జిల్లాలో నేటి నుంచి జయంత్యుత్సవాలు షురూ

6లో..

మిర్చి ధర తగ్గిందని.. రైతుల ఆందోళన

- మానుకోట జాతీయ రహదారిపై ధర్నా
- మార్కెట్ కార్యాలయం దిగ్బంధం
- పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన గొడవ



మానుకోట మార్కెట్ ఎదుట జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 13 : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి.. మిర్చికి ధరలు తగ్గించి, మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం ఆందోళనకు దిగారు. మార్కెట్ అధికారులు విన్నర్‌లిస్టు ప్రకటించగానే రైతులు మార్కెట్ కార్యాలయం దిగ్బంధనం చేసి, జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. దీంతో ఓ వైపు ధర్నా, మరోవైపు కార్యాలయం ఎదుట ఆందోళనతో మార్కెట్ అట్టుడికిపోయింది. గత వారంలో మిర్చి క్వింటాకు మహబూబాబాద్‌లో రూ.22,500 వరకు గరిష్ట ధర పలుకగా, కేసముద్రం మార్కెట్లో రూ.23 వేలపైన ధరతో కొనుగోలు చేశారు. అయితే గత రెండ్రోజుల నుంచి ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతుల ఆందోళన ప్రారంభమైంది. అయితే మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం మిర్చి క్వింటాకు రూ.21,900 గరిష్ట ధర కాగా, కనిష్ట ధర రూ.11410 పలికింది. మంగళవారం గరిష్ట ధర మిర్చికి రూ.21,689 పలుకగా, కనిష్ట ధర రూ.10701, సగటున రూ.19225 ధరలు పలికాయి. సాయంత్రం విన్నర్ లిస్టును మార్కెట్ అధికారులు ప్రకటించగానే ధరలు తగ్గడంతో రైతులుఒక్కసారిగా మార్కెట్ కార్యాలయానికి చేరి వ్యాపారులు కుమ్మక్కయ్యారని, సిండికేట్‌గా మారి, ధరలు తగ్గిస్తున్నారని, కొంతమం దికే హైరేటు వేస్తున్నారని, 58 శాతం మంది రైతులకు చెందిన మిర్చిని క్వింటాకు రూ.15 వేల నుంచి రూ.16 వేల వరకు ఖరీదు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని, కురవి, గుండ్రాతిమడుగు, నైనాల గ్రామాలకు చెందిన నాగయ్య, అంజానాయక్ ఆరోపించారు. తాము జెమిని వైరస్‌తో తీవ్రంగా నష్టపోయి, అలాగే పెట్టుబడి అత్యధికంగా పెట్టి నష్టపోయామని, తీరా కొంతమేర దిగుబడి వచ్చిమిర్చిని మార్కెట్‌కు తీసుకువస్తే తక్కువ ధరలకు ఖరీదు చేసి.. తమను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు మార్కెట్ కార్యాలయం ఎదుట ఇల్లందు బైపాస్ రోడ్డుపై ధర్నా చేస్తుండడంతో ట్రాఫిక్‌కు భారీగా అంతరాయంతో వాహనాలు పెద్దసంఖ్యలో నిలిచిపోయాయి. దీంతో ఎస్సై రామారావు ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు న్యాయం చేస్తామని నచ్చచెప్పి, ఆందోళనను విరమించారు.

మానుకోట మార్కెట్ కమిటీ రద్దు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 13 : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (పాలకమండలి)ని రద్దు చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీవో నెంబర్ 230 ద్వారా 12-02-2024 ద్వార రాష్ట్రప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు మార్కెట్ కమిటీని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, వైస్ చైర్మన్ గుండా రాజశేఖర్‌తో పాటు సభ్యులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, కేసముద్రం మార్కెట్ కమిటీ గతనెల 12న రద్దు చేసి ఈ కమిటీని మాత్రం దాదాపు నెలరోజుల తర్వాత రద్దు చేయడం జరిగింది. మార్కెట్ కమిటీ ఇన్‌చార్జిగా జిల్లా మార్కెటింగ్ అధికారిగా వరంగల్‌కు చెందిన ప్రసాదరావును ఈ మార్కెట్‌కు ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తల్లీకుమారుడి దారుణ హత్య

- ఆటోలో ఇంటికి వస్తుండగా రాడ్‌తో కొట్టిచంపిన ప్రత్యర్థి
- గూడూరులో ఘటన
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

మంత్రాల నెపంతో హతమార్చిన దుండగుడు

గూడూరు, ఫిబ్రవరి 13 : ఆధునిక సమాజంలో దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. మూఢనమ్మకాలు ప్రాణాలు తీస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం ఇంత అభివృద్ధి చెందినా.. క్షణికావేశంతో మంత్రాల నెపంతో మనుషులను దారుణంగా చంపుతున్నారు. తాజాగా మంగళవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో 365 జాతీయ రహదారిపై మంత్రాల మూఢనమ్మకం రెండు ప్రాణాలను బలితీసుకుంది. బొల్లెపల్లిలో రెండు కుటుంబాల మధ్య చోటు చేసుకున్న మంత్రాల గొడవ.. పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పలు పంచాయతీలు జరిగిన క్రమంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వెళ్తున్న తల్లి సమ్మక్క (55), కుమారుడు సమ్మయ్య (40)లను ప్రత్యర్థి దారికాచి, మంగళవారం మధ్యాహ్నం నడిరోడ్డుపై రాడ్డుతో మోది హతమార్చాడు. ఈ ఘటనను చూసి చలించి పోయిన స్థానికులు నిందితుడైన శివరాత్రి కుమారస్వామిని పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

గూడూరు మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట్ల సమ్మక్క-కొమురయ్య దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కూలీ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కుమారుడు సమ్మయ్య ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంత కాలంగా అదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ శివరాత్రి కుమారస్వామి కుటుంబసభ్యులు తరుచుగా అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ క్రమంలో సమ్మక్క తమ కుటుంబసభ్యులపై మంత్రాలు చేశారనే అనుమానంతో ఇటీవల కాలం లో పలుమార్లు గొడవలు జరిగాయి.

చివరకు పోలీస్‌స్టేషన్‌లో కూడా ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. తాజాగా మంగళవారం సమ్మక్క, భర్త కొమురయ్య, కుమారుడు సమ్మయ్య, కోడలు రజిత గూడూరు ఠాణాకు వెళ్లి, తమ గోడును చెప్పుకుని బయటకు వచ్చారు. అనంతరం వారు ఆటోలో తమ ఇంటికి వస్తుండగా.. గూడూరు మండలకేంద్రంలోని 365 జాతీయ రహదారిపై కాసుకుని ఉన్న కుమారస్వామి వారితో ఘర్షణకు దిగి ఒక్కసారిగా రాడ్డుతో దాడి చేశాడు. ఈ ఘటనలో తల్లి సమ్మక్క, కుమారుడు సమ్మయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం సమ్మక్క భర్త కొమురయ్యపై దాడి చేస్తుండగా, స్థానికులు అడ్డుకోవడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. వెంటనే అతన్ని గూడూరు సీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. ఇదే ఆటోలో ప్రయాణిస్తున్న సమ్మయ్యభార్య రజిత భయాందోళనతో పరుగులు పెట్టడంతో ఆమె ప్రాణాలను దక్కించుకుంది.



ఘటనా స్థలంలో సమ్మక్క, సమ్మయ్య మృతదేహాలు

నిందితుడికి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగింత..

గూడూరులో మంత్రాల నెపంతో తల్లి, కుమారుడిని రాడ్డుతో కొట్టి చంపిన శివరాత్రి కుమారస్వామిని స్థానికులు పట్టుకుని, విద్యుత్ స్తంభానికి కట్టి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి, అతడిని వారికి అప్పగించారు. కాగా, సంఘటన స్థలానికి మహబూబాబాద్ డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ, గూడూరు సీఐ ఫణిదర్, ఎస్సైలు రాణాప్రతాప్, నగేష్, దిలీప్, ప్రవళిక చేరుకుని ఘటనాస్థలిని పరిశీలించారు. దాడికి గల కారణాలపై ఆరా తీశారు. తల్లి, కొడుకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు సీహెచ్‌సీకి తరలించారు. మృతుడు సమ్మయ్యకు భార్య రజిత, ఇద్దరు కుమార్తెలు గౌతమి, సాత్విక, కుమారుడు హేమంత్ ఉన్నారు. సమ్మయ్య భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు పోలీసులు తెలిపారు.

మేడిగడ్డపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ లబ్ధికి ప్రయత్నాలు : బీజేపీ పార్లమెంట్ కార్యాలయ ప్రారంభోత్సవంలో కిషన్‌రెడ్డి

హనుమకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారాన్ని ఉపయోగించుకుని రాజకీయంగా లబ్ధిపొందేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలాడుతున్నాయని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నగరానికి వచ్చిన ఆయన హంటర్‌రోడ్‌లో బీజేపీ వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఒకరు కృష్ణా జలాలపై, మరొకరు కాళేశ్వరంపై రచ్చ చేస్తూ లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధిపొందేదుకు ప్రయత్నిస్తున్నాయని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి వెళ్లని కేసీఆర్.. మంగళవారం నల్లగొండ జిల్లాలో కృష్ణాజలాలపై ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే కేసీఆర్ సభకు ప్రతిగా సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలను వెంటేసుకొని మేడిగడ్డ వెళ్లారని, అసెంబ్లీని బంద్ పెట్టి ఆయన మేడిగడ్డకు వెళ్లి ఏంచేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకువస్తే కాళేశ్వరంపై దర్యాప్తు చేయడానికి సీబీఐ సిద్ధంగా ఉందని కేంద్రం గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందన లేదన్నారు. ప్రాజెక్టు సర్వే, ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, ఆపరేషన్, నిర్వహణలన్నీ లోపభూయిష్టంగా ఉన్నాయని గతంలోనే తెలిసినా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తోందని, విజిలెన్స్‌తో దర్యాప్తు చేయించినట్టు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందని, కానీ విజిలెన్స్ ఇచ్చిన నివేదికలో కూడా డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులు ఇచ్చిన నివేదికలోని వివరాలే ఉన్నాయన్నారు. దీనినిబట్టి చూస్తే మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం వాడుకుంటున్నట్టు స్పష్టమవుతోందన్నారు. కేంద్రంపై నిందలు వేస్తూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడానికే కేసీఆర్ నల్లగొండ సభ పెట్టారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్ని డ్రామాలు ఆడినా దేశానికి ప్రధానిగా నరేంద్ర మోదీనే ఉండాలని తెలంగాణ ప్రజలు బలంగా కోరుకుంటున్నారన్నారు. ఈవిలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ మంత్రి గుండె విజయరామారావు, ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, టి.రాజేశ్వర్‌రావు, మురళీధర్‌గౌడ్, పెసరు విజయచందర్‌రెడ్డి, డాక్టర్ కాళీ ప్రసాద్, గుజ్జ సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హనుమకొండలోని వేయిస్తంబాల గుడి ఆవరణలో పునర్నిర్మాణం అయిన కళ్యాణ మండపాన్ని సందర్శించారు.


బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవం

వేయిస్తంభాలగుడి కల్యాణ మండప పునర్నిర్మాణం అద్భుతం

(3వ పేజీ తరువాయి)

కేంద్ర పురావస్తు చట్టంలో కొన్ని సవరణలు తీసుకురాబోతున్నామని, ఆ చట్టంలోని కఠిన నిబంధనలవల్ల ప్రాచీన కట్టడాలు, ఆలయాల సందర్శనలో, కట్టడాల మరమ్మతు, దేవతామూర్తులకు పూజల నిర్వహణ తదితర విషయాల్లో తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై పర్యాటకులు, భక్తుల మనోభావాలు, స్థానిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్వేచ్ఛగా సందర్శించేలా అవకాశం కల్పిస్తూ సవరణలు చేయాలనుకుంటున్నట్టు వెల్లడించారు. ఇక ములుగు జిల్లాలో రూ.900కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న గిరిజన విశ్వవిద్యాలయం తరగతులను అందుబాటులో ఉన్న భవనాల్లో ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తామన్నారు. విశ్వవిద్యాలయ ఏర్పాటుకు భూసేకరణ పూర్తయిందని, భవన నిర్మాణ పనుల త్వరితగతి పూర్తికి ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. దీనిని త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారన్నారు. ఇక ఈ విశ్వవిద్యాలయంపై అవగాహన కల్పించడానికి త్వరలో జరిగే మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరలో ఓ ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన సమ్మక్క సారలమ్మ గిరిజన జాతరలో ఏర్పాట్లకు కేంద్రం నిధులు ఇస్తోందని చెప్పారు. అంతకుముందు కిషన్‌రెడ్డి వేయిస్తంభాల గుడిలో పూజలు చేయగా.. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, అర్చకులు గంగు మణికంఠ మంత్రికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. మంత్రి వెంట ఇంటాక్ కన్వీనర్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, కేంద్ర పురావస్తు శాఖ అధికారులున్నారు.

పురావస్తు అధికారులపై ఫిర్యాదు

కేంద్ర పురావస్తుశాఖ అధికారులపై వరంగల్ కోటకు చెందిన కొందరు స్థానికులు ఫిర్యాదు చేశారు. వరంగల్‌కోట చుట్టూ ఉన్న కట్టను తవ్వి మట్టిని అక్రమంగా తరలిస్తున్నా పురావస్తుశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, మట్టిని ఇష్టారీతిన తవ్వడంవల్ల ప్రాచీన కట్టడాలు కుంగికూలిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కోటలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని మంత్రికి వివరించారు. అందుకు స్పందించిన మంత్రి.. ఈ విషయమ్మై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మట్టి తవ్వకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు.


ఆర్.దీపాన్ష్ రెడ్డి పి.నిహాల్ శ్రీవాత్సవ్ కె.శ్రీరాం రెడ్డి కె.సిద్ధార్థ రెడ్డి

'జేఈఈ మెయిన్స్'లో ఎస్ఆర్ ప్రభంజనం

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 13: దేశంలోకెల్లా అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ మెయిన్స్ 2024 (సీజన్-1) ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జాతీయస్థాయిలో ఎస్ఆర్ విద్యార్థులు విజయపతాకాన్ని మరోసారి ఎగురవేశారు. జేఈఈ మెయిన్-2024 (సీజన్-1) ప్రవేశ పరీక్షలో ఎస్ఆర్ విద్యార్థులు జాతీయ స్థాయిలో దొంతుల మనీష్ 99.99 శాతం పర్సంటైల్, అలాగే తుమ్మ తేజస్వీ 99.95 శాతం, ఆర్.దీపాన్ష్ రెడ్డి 99.19శాతం, పి.నిహాల్ శ్రీవాత్సవ్ 99.91 శాతం, కె.శ్రీరాంరెడ్డి 99.91, కె.సిద్ధార్థరెడ్డి 99.77, వద్లూరి ప్రతీక్ 99.75, వి.సాయి ప్రణతి 99.66, ఉప్పల సూర్యతేజ 99.57, చెన్నకేశవరెడ్డి 99.43, ఎం.శ్రీవల్లి 99.42, ఎం.చంద్రదీప్ 99.35, కె.సుబ్రమణ్య ఆకాష్ 99.32, వి.వైశాలి 99.31 శాతం పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా హనుమకొండలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయస్థాయి అత్యుత్తమ పర్సంటైల్ సాధించడం అభినందనీయని, భవిష్యత్‌లో అత్యుత్తమైన ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని తెలిపారు. పరీక్షలు ఏవైనా ఎస్ఆర్ విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో ర్యాంకుల పంట కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన సీఎం పర్యటన

పోలీసుల పటిష్ట భద్రత

భూపాలపల్లి, ఫిబ్రవరి 13 : రాష్ట్ర రాజకీయాల్లోనే ఎంతో ఆసక్తిని రేపిన మేడిగడ్డ ప్రాజెక్టులోని లోపాలను, అసలు నిజాలను బయటపెట్టే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి చేపట్టిన మేడిగడ్డ పర్యటన పటిష్ట భద్రత మధ్య ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం నుంచే భూపాలపల్లి నుండి మేడిగడ్డ వరకు దాదాపు 800 మంది సాయుధ పోలీసులను మోహరించి అనువ నువున తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా కల్వర్టులు, రోడ్డు వంతెనలు ఉన్న ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన మేడిగడ్డకు వచ్చి వెళ్లడంతో పోలీసు యంత్రాంగం ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించి అటవీ ప్రాంతాల్లో బారీ ఎత్తున కూంబింగ్ నిర్వహించారు. ప్రధానంగా మేడిగడ్డ ప్రాజెక్టు పరిసరాల్లో డ్రోన్లత సహాయంతో భద్రతను పర్యవేక్షించారు. నిరంతరం జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తూ అప్రమత్తం చేశారు. ఇక కాళేశ్వర ముక్తీశ్వర ప్రాజెక్టును ప్రారంభించి తరువాత అప్పటి ప్రభుత్వం బ్యారేజీ సందర్శనలపై అడుగడుగున ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత ప్రాజెక్టులో లోపాలన్ని ఒక్కొక్కటిగా బయటపడుతుంగటంతో రాష్ట్రప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టు వ్యవహారంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది.

ఈ క్రమంలో ఇటీవల విజిలెన్స్ నివేదికలను ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యులపై చర్యల కు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌గా వ్యవహరించిన వెంకటేశ్వర్లు పాత్రను గుర్తించి ఆయన్ను రెండు రోజుల కిందట విధుల నుంచి తొలగించారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి మంగళవారం పలువురు మంత్రి వర్గ సహచరులు, కాంగ్రెస్, ఎంఐఎం, సీపీఐ పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించారు. మధ్యాహ్నం 3:34 గంటలకు మేడిగడ్డకు చేరుకున్న ముఖ్యమంత్రి బృందం నేరుగా బ్యారేజీపైకి చేరుకొని అణువణువు పరిశీలించారు. ఆసమయంలోనూ, అనంతరం బ్యారేజీ సమీపంలో ఇంజనీరింగ్, విజిలెన్స్ అధికారులు ఏర్పాటుచేసిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లోనూ ప్రాజెక్టు నిర్మాణంలో దొర్లిన తప్పులు, జరిగిన అవినీతి రీడిజైన్ పేరుతో నిధుల దోపిడీ లాంటి అంశాలను ఆరా తీసిన సీఎం.. ప్రాజెక్టు నిర్మాణం మొత్తంమీద నిర్మాణ సంస్థ, గత ప్రభుత్వ కుమ్మక్కు వ్యవహారం ఉందనే రీతిలో తీవ్ర వ్యాఖ్యలు చేయడం, దీనిపై అసెంబ్లీలో సుదీర్ఘంగా చర్చిస్తామని సంకేతాలు ఇవ్వడం గమనార్హం.


మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేల బృందం


మేడిగడ్డ బ్యారేజీ వద్ద ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం పర్యటన షెడ్యూల్

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్, ఫిబ్రవరి 13 : కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీ ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల పర్యటన మూడున్నర గంటలపాటు సాగింది.

- మధ్యాహ్నం 3.34గంటలకు బ్యారేజీ పరిసరాల్లోకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి
- మధ్యాహ్నం 3.35 గంటలకు మేడిగడ్డ బ్యారేజీ సభా స్థలి నుంచి కుంగిన ప్రాంతానికి బయలు దేరిన సీఎం
- మధ్యాహ్నం 3.40 గంటలకు బ్లాక్-7లో బ్యారేజీ వంతెన మీద కుంగిన ప్రాంతానికి చేరుకుని మధ్యాహ్నం 3.52 గంటల వరకు పరిశీలన
- మధ్యాహ్నం 3.53 గంటలకు బ్యారేజీ వంతెనపై నుంచి గోదావరి రివర్ బెడ్‌లోకి బయలుదేరిన సీఎం
- మధ్యాహ్నం 3.59 గంటలకు గోదావరి రివర్‌బెడ్‌లో బ్లాక్-7లో గల 20వ పిల్లరు వద్దకు చేరుకున్న సీఎం
- సాయంత్రం 4గంటల నుంచి 4.09 గంటల వరకు పగుళ్ల తేలిన 20వ పిల్లరును మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించిన సీఎం
- సాయంత్రం 4.10 గంటల నుంచి 4.25వరకు పగుళ్ల తేలిన పిల్లరు వద్ద మీడియాకు మైక్ ద్వారా వివరాలు వెల్లడించిన మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- సాయంత్రం 4.25 గంటల వరకు గోదావరి రివర్ బెడ్ నుంచి బ్యారేజీ సభావేదిక వద్దకు బయలుదేరిన సీఎం
- సాయంత్రం 4.32 గంటలకు మేడిగడ్డ బ్యారేజీ సభావేదిక వద్దకు చేరుకున్న సీఎం
- సాయంత్రం 4.33 నుంచి సాయంత్రం 4.39 గంటలవరకు వరకు రెస్ట్ , స్నాక్స్ తీసుకున్న సీఎం, బృందం
- సాయంత్రం 4.40 గంటలకు వేదిక వద్దకు చేరుకున్న సీఎం
- సాయంత్రం 4.40 గంటల నుంచి రాత్రి 7. 06 గంటల వరకు కొనసాగిన సీఎం రివ్యూ, పవర్ పాయింట్ ప్రజంటేషన్
- రాత్రి 7.09 గంటలవరకు మేడిగడ్డ నుంచి బయలుదేరి వెళ్లిపోయిన సీఎం

మేడిగడ్డ.. 'లక్ష' అబద్ధాల పుట్ట!

(3వ పేజీ తరువాయి)

మేడిగడ్డ బ్యారేజీ కుంగితో ఇప్పటి వరకు చీఫ్ డిజైనర్, చీఫ్ ఇంజనీర్‌గా చెప్పుకునే కేసీఆర్ ఒక్కమాట కూడా మాట్లాడలేదని ఎద్దేవ చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు కాళేశ్వరం ఫెల్యూర్ ప్రాజెక్టు అని తేల్చారని అన్నారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారుల సూచనలతో ముందుకెళ్తామన్నారు.

తెలంగాణ ప్రజల గుండెకు పగుళ్లు

: ఎమ్మెల్యే కూనంనేని

కాళేశ్వరం ప్రాజెక్టును ఇలా చూడటం బాధాకరంగా ఉందని, ఇవి మేడిగడ్డ పగుళ్లు కాదని, తెలంగాణ ప్రజల గుండెకుఏ ఏర్పడిన పగుళ్లని సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. మూడేళ్లలో నిర్మించడం, ఎనిమిదేళ్లలో కూలిపోవడం ప్రాజెక్టులో డిజైన్ లోపమేనని ఆరోపించారు. మోతాదుకు మించి నీటిని నిల్వ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును నాశనం చేశారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అతి పెద్ద లోపం ఉందని ఆరోపించారు. నాణ్యత లోపంతో నిర్మించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు కుంభకోణాలతో ప్రజాధనాన్ని వృధా చేసి.. ప్రస్తుత ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ఎగ్గొడుతోందని మాట్లాడటం సిగ్గు చేటన్నారు. లక్ష కోట్లు గోదారిలో పోసినట్లేనని, ఇంకా పదేళ్లయినా ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో రాదని అన్నారు. ప్రభుత్వం నిపుణులతో సంప్రదించి ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకోవాలని సాంబశివరావు డిమాండ్ చేశారు.

పరిశీలిస్తూ.. ప్రశ్నిస్తూ.. విమర్శిస్తూ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడిగడ్డ పర్యటన ఉత్కంఠగా సాగింది. ఆయన ప్రాజెక్టును ఆసాంతం క్షుణ్ణంగా పరిశీలిస్తూ.. అధికారులను ప్రశ్నిస్తూ.. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం, అవినీతిపై విమర్శలు చేస్తూ సాగారు. సుమారు మూడున్నర గంటల పాటు ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి పర్యటించారు. మంగళవారం మధ్యాహ్నం 3:34 గంటలకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీకి చేరుకున్నారు. బ్యారేజీపైన 7వ బ్లాక్ వద్ద కుంగిన ప్రాంతాన్ని పరిశీలించిన సీఎం అక్కడే ఉన్న ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి ఎంత మేర భూమిలో కుంగిందనే విషయాన్ని తెలుసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా గోదావరిలోకి వెళ్లి 20వ పిల్లర్ వద్ద పగుళ్ల ఏర్పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. తనతో పాటు వచ్చిన ఎంఐఎం, సీపీఐ ఎమ్మెల్యేలకు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పగుళ్ల ఏర్పడ్డ బ్యారేజీ పిల్లర్లను చూపించారు. ప్రాణహిత నది నుంచి వచ్చే నీటికి మేడిగడ్డ వద్ద అడ్డుకట్ట వేసి ఇక్కడి నుంచి కన్నెపల్లి పంప్‌హౌజ్ ద్వారా అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి ఎల్లంపల్లికి ఏ విధంగా నీటిని పంపింగ్ చేస్తారో సీఎం వివరించారు. సుమారు మూడున్నర గంటల పాటు సాగిన పర్యటనలో సీంతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావుతో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నీటిపారుదల, తదితర శాఖల ఉన్నతాధికారులున్నారు.


బ్యారేజీ గురించి సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరిస్తున్న అధికారులు

తల్లులను తలచి.. తరించి..


ప్రధాన ద్వారం గుండా వస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 13: మహాజాతరకు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోంది. మహాజాతరకు మరికొద్దిరోజులే సమయం ఉన్న నేపథ్యంలో ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు ఆ తల్లుల చెంతకు తరలొస్తున్నారు. ఈ క్రమంలో వనజాతర ప్రాంగణాలైన ములుగు జిల్లా మేడారం భక్తులతో సందడిగా మారుతోంది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి.. కల్యాణకట్టలలో తలనీలాలు సమర్పించుకుని గద్దెలకు చేరుకొని అమ్మవార్లకు నేరుగా పూలు, పండ్లు, పసుపు, కుంకుమ చీరె, సారెతో పాటు కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించుకుంటున్నారు. పూజలు చేసి యాట మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం సుమారు 50వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తెలిపారు.

భక్తుల కోసం సకల ఏర్పాట్లు

మేడారం తరలివస్తున్న భక్తుల కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. గద్దెల వద్ద దర్శన సమయంలో ఎవరైనా తప్పిపోతే వెంటనే దేవాదాయ శాఖ సమాచార కేంద్రం(మంచె) వద్దకు వచ్చి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందేలా ఏర్పాట్లు చేశారు. మైకుల ద్వారా వారి వివరాలను ప్రకటిస్తుండటంతో వారు తమ కుటుంబ సభ్యులను సులువుగా చేరుకుంటున్నారు.

1500 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు

ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులపాటు వైభవంగా జరిగే మేడారం సమ్మక్క సారలమ్మల మహాజాతరకు వచ్చే వాహనాల కోసం రోడ్లు, పార్కింగ్ స్థలాల పనులు పూర్తయ్యాయి. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మేడారంతో పాటు పరిస... చెక్ పోస్టు, ఊరట్టం, మేడారం గ్రామాల్లో 30పార్కింగ్ బ్లాక్ ... పూర్తిచేశారు. కొన్ని మార్గాల్లో కొత్త రహదారులను, సీసీ రోడ్లను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నారు. మహాజాతరకు 5లక్షల పైగా వాహనాల్లో భక్తులు తరలొస్తారనే పోలీసు అధికారుల అంచనాలు, సూచనలతో రూ.80లక్షలతో కన్నెపల్లి, నార్లాపూర్, ఎలుబాక, పడిగాపూర్, లలో 1500 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. అలాగే ప్రధాన రహదారులతో పాటుగా పార్కింగ్ స్థలాల వద్ద మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర పనులను పూర్తిచేశారు.

మేడారంలో కొనసాగుతున్న ముందస్తు మొక్కులు



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

భక్తుల విశ్వాసం పెంపొందించాలి

- పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- మేడారంలో పలు శాఖల అధికారులతో సమావేశం

మేడారం, ఫిబ్రవరి 13: మేడారం సమ్మక్క సారలమ్మల మహాజాతర గొప్పతనాన్ని భక్తుల విశ్వాసాన్ని పెంపొందించాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మేడారంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్, ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్‌లతో కలిసి పర్యటించిన మంత్రి పలు శాఖల అధికారులతో మేడారం హరిత హోటల్ సమావేశం గదిలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ సుదూర ప్రాంతాల నుంచి మేడారం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యంగా జంపన్నవాగు పరిసర ప్రాంతాలలో ఎలాంటి ప్రాణనష్టం జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాద స్థలాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికే తెలిసేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ స్థలాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సైన్ బోర్డులు, ఫ్లడ్‌లైట్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. కళ్యాణ కట్టల్లో నాయిబ్రాహ్మణులు భక్తుల నుంచి అధిక మొత్తం వసూలు చేయకుండా ఒకే మొత్తం నిర్ణహించాలన్నారు.

అనంతరం గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్ మాట్లాడు తూ.. మేడారం జాతరలో జంపన్నవాగు, చిలకల గుట్ట, అమ్మవార్ల గద్దెల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. మహాజాతర విధులు నిర్వర్తించే సిబ్బంది ఎవరికి కేటాయించిన స్థానాలలో మాత్రమే విధులు నిర్వర్తించేలా సెక్టోరియల్ జోనల్ అధికారులు చూడాలని అన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం రూ. 105 కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. జాతరలో సంబంధిత శాఖల ప్రోటోకాల్ అధికారులను ఏర్పాటు చేసే విధంగా చూడాలని జిల్లా ఎస్పీ శబరీష్‌ను కోరారు. జాతర పరిసర గ్రామాల్లో మూగ జీవాల కు ఎలాంటి హాని కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతరలో భక్తులకు వైద్యసేవలు అందుబాటులో ఉండేలా 40 బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం మంత్రి అధికారులతో కలిసి వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నా రు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, ఏటూరునాగారం అదనపు ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లా అటవి శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, దేవాదాయ శాఖ మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

కమిషనరేట్ నుంచి ఇన్‌స్పెక్టర్ బదిలీ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 13: వరంగల్ పోలీసు కమిషనరేట్ వెయిటింగ్‌లో ఉన్న జె. వెంకటరత్నం నుంచి ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ మల్టీ జోన్ ఐజీ తరుణ్‌జోషి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన బదిలీలలో వెంకటరత్నం పరకాల నుంచి వరంగల్ కమిషనరేట్‌కు అటాచ్ అయ్యారు. ప్రస్తుతం పోస్టింగ్ కోసం రిజర్వ్‌లో ఉండగా ఆయనను ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 13 : బంజారాల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్. ఆయన జయంతిని పండుగగా ఘనంగా జరుపుకుంటారు. సంచార జాతులుగా ఉన్న వనవాసీలను స్థిర నివాసులుగా మార్చి.. విద్య, వైద్య, వ్యవసాయం, సంస్కృతి, సంప్రదాయం, పశుపోషణ వంటి అంశాలపై అవగాహన కల్పించి ధర్మం వైపు నడిపించిన మహనీయుడు సేవాలాల్ మహరాజ్. అందుకే ఆయనను వారు దేవుడిగా కొలుస్తారు. 1739 ఫిబ్రవరి 15న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా రాంజీనాయక్ తండాలో భీమానాయక్-ధర్మిణి బాయ్ దంపతులకు సేవాలాల్ మహరాజ్ జన్మించారు.

బంజారాలు వివిధ రాజ్యాలకు యుద్ధ సామగ్రిని చేరవేస్తూ.. సంచార జీవులుగా జీవనం సాగిస్తుండేవారు. ఆ క్రమంలో బ్రిటీష్ పాలకుల మతప్రచారం వల్ల బంజార సమాజం తీవ్ర ఇబ్బందులు కలిగి ప్రమాదంలో పడిపోయింది. జాతి చెల్లాచెదురై, కొండా కోనల్లో ఆత్మరక్షణ కోసం తలదాచుకుంది. దీంతో బంజార జాతిని సన్మార్గంలో నడిపించటానికి సేవాలాల్ మహరాజ్ జగదాంబమాత అనుగ్రహంతో దైవస్వరూపుడిగా అవతరించి, బంజారాలు సంచారం చేయొద్దు, స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని అక్కడే వ్యవసాయం చేయాలని పశు, ప్రకృతిపై ఆరాధన చేయాలని, ఆచార సాంప్రదాయాలను గౌరవించాలని, మద్యపానం, ధూమపానంతో కలిగే నష్టాలపై చైతన్యం కలిగించారు. దీంతో మహరాజ్ అని కొనియాడుతూ బంజారాలు ఏటా ఫిబ్రవరి 15న స్మరించుకుంటారు.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణలో ప్రభుత్వం అధికారికంగా సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించడంతో పాటు నిధులు మంజూరు చేస్తూ వచ్చేది. అదే మాదిరిగా ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ప్రభుత్వం అధికారికంగా నిధులు కేటాయించి, ఉత్సవాలు నిర్వహించడానికి సంసిద్ధమైంది. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా పట్టణ, మండల, గ్రామ, తండాల్లో సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 14న బోగ్ బండారో కార్యక్రమాలు నిర్వహిస్తూ, నైవేద్యం, ప్రసాదాలు పంపిణీ చేయనున్నారు.

లంబాడీల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని లంబాడ గిరిజనులు పండుగ వాతావరణంలో జరుపుకునేందుకు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి, సేవాలాల్ జయంతి రోజున సెలవుదినంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన కోరిక మేరకు సీఎంఆప్షనల్ హాలీడే ప్రకటించడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేడుకలకు నిధుల మంజూరు

ఎర్రయ్య గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్



గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహిస్తాం. డోర్నకల్, మహబూబాబాద్ రెండు నియోజకవర్గాలు రూ.8.04 లక్షలు మంజూరయ్యాయి. డోర్నకల్ నియోజకవర్గానికి రూ.4.03 లక్షలు, మహబూబాబాద్ నియోజకవర్గానికి రూ.4.01 లక్షలు కేటాయించారు. జయంతి ఉత్సవాలకు డీఆర్‌డీఏ నుంచి ఒకరు, పశుసంవర్ధకశాఖ నుంచి ఒకరు వేడుకలను పర్యవేక్షిస్తారు. ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేలు కమిటీ చైర్మన్లుగా ఉండి వారు సూచన మేరకు జయంతి ఉత్సవాలను నిర్వహిస్తారు.

ఇంటర్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

- జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ



ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తున్న డీఐఈవో సత్యనారాయణ, అధ్యాపకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి13 : త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి సమ్మెట సత్యనారాయణ అన్నారు. మానుకోట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సదానందం అధ్యక్షతన మంగళవారం ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సత్యనారాయణ మాట్లాడారు. వార్షిక పరీక్షలకు సమీపిస్తున్నాయని, విద్యార్థినులు పట్టుదల, క్రమశిక్షణతో చదువుకొని ఎలాంటి అభద్రతాభావానికి లోనుకాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తొలుత విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ వీరేందర్, అధ్యాపకులు అశోక్, నారాయణ, ఫక్రుద్దీన్, మధు, రవీందర్, సుధాకర్, నాగిరెడ్డి, శ్రీనివాస్, శీకళ, గోవర్దన్ పాల్గొన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా రజినీకాంత్



మరిపెడ, ఫిబ్రవరి13 : బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా ఎడ్జర్ల గ్రామానికి చెందిన సొంటి రజినీకాంత్ నియామకం అయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచలి వెంకటేశ్వర్‌రావు మంగళవారం నియమాక ఉత్తర్వులను పంపగా పార్టీ అధ్యక్షుడు బింగి రమేశ్ రజినీకాంత్‌కు అందచేశారు. కాగా, తనపై ఎంతో నమ్మకంతో పార్టీ ఉపాధ్యక్షుడి పదవి అప్పగించిన జిల్లా, మండల బాధ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానని రజినీకాంత్ తెలిపారు.

మానుకోట డీఎస్పీ సత్యనారాయణ బదిలీ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి13 : మహబూబాబాద్ డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 110 మంది డీఎస్పీ, ఏసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగానే సత్యనారాయణను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. కాగా, సైబరాబాద్ డీఎస్పీ ఎస్.తిరుపతిరావు మానుకోట డీఎస్పీగా బదిలీ అయ్యారు.

రూరల్ సీఐగా శరవయ్య బాధ్యతల స్వీకరణ



మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : మహబూబాబాద్ రూరల్ సీఐగా శరవయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 సంవత్సరంలో ఎస్సైగా విధుల్లో చేరిన ఆయన ఖమ్మం జిల్లాలోని ముదిగొండ, తిర్మలాయపాలెం, కల్లూరు, చంద్రుగొండ, ఖమ్మం టూ-టౌన్, త్రీటౌన్, మహిళా పోలీస్ స్టేషన్‌లలో సీఐగా విధులు నిర్వహించారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా మహబూబాబాద్ రూరల్ సీఐగా విధుల్లో చేరారు. అనంతరం జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీపాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

టౌన్ సీఐగా పెండ్యాల దేవేందర్..



మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : మానుకోట టౌన్ సీఐగా పెండ్యాల దేవేందర్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. 2012లో ఎస్సైగా చేరి డోర్నకల్ జీఆర్పీగా పనిచేసి అనంతరం మట్టెవాడ, నెల్లికుదురు, గీసుకొండ, సంగెం, మిల్స్ కాలనీలో పనిచేసి 2023 జూలైలో టాస్క్‌ఫోర్స్ సీఐగా పదోన్నతి పొంది వరంగల్‌లో విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన సీఐల బదిలీ ల్లో భాగంగా మహబూబాబాద్ టౌన్ సీఐగా దేవేందర్ బదిలీపై వచ్చారు. అనంతరం ఎస్పీ సంగ్రామ్ సింగ్‌జీపాటిల్‌ను కలిసి మొక్కను అందించారు.

కేజీబీవీని తనిఖీ చేసిన సెస్ బృందం

డోర్నకల్, ఫిబ్రవరి13 : మునిసిపల్ కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని మంగళవారం సామాజిక ఆర్థిక అధ్యయన కేంద్రం (సెస్) ప్రతినిధులు తనిఖీ చేశారు. పాఠశాల వంటగది, మరుగుదొడ్లు, స్నానపుగదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మెనూ గురించి తెలుసుకున్నారు. ఈ బృందంలో సంపత్, అనూష, శృతి ఉన్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మున్నీ పాఠశాలలో ఇంకా ఏర్పాటు కావాల్సిన మౌళిక వసతుల గురించి వివరించారు.

గరంగరంగా తొర్రూరు మండల సభ

- పూర్తిస్థాయిలో హాజరుకాని అధికారులు
- సమాచారం ఇవ్వడంలేదని ఆరోపణ



సభలో వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ ఎంపీపీ

తొర్రూరు, ఫిబ్రవరి 13 : తొర్రూరులోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ టీసీ అంజయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గరంగరంగా జరిగింది. సభకు 15 మంది ఎంపీటీసీలు హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే వచ్చారు. మండలంలోని ఆయా గ్రామాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించగా వారు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. ఆయాశాఖల అధికారులు కూడా రాకపోవడంతో సభ పూర్తిస్థాయిలో నిర్వహించలేక పోయారు. రైతుల సమస్యలు, శిక్షణ విధానం తదితర అంశాలపై నిర్వహించే సభలకు ప్రజాప్రతినిధులకు వ్యవసాయాదికారి సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారి, ఏఈవోలు స్థానికంగా అందుబాటులో ఉండటం లేదని, సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు అవడం సరికాదన్నారు. మండలంలోని అమ్మాపురంలో చిన్నారులు మృత్యువాత పడితే వైద్యాధికారులు పోస్టుమార్టం చేయకపోవడంపై వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీ ముద్దం విక్రమ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అందుబాటులో ఉండకపోవడం, స్థానిక వైద్యులు పట్టించుకోక పోవడంతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పీఏ జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ చేయడంతో పోస్టుమార్టం చేశారన్నారు.

సర్వసభ్య సమావేశంలో అధికారులు ప్రగతి నివేదికలు ఇవ్వడంలేదని, గతంలో ఒకసారి సమావేశం ఏర్పాటు చేయకుండానే రిజిస్టర్‌లో సంతకాలు చేసుకుని సభ నడిపినట్లుగా చూపారని వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి ఆరోపించారు. అధికారులు ఏ ఒక్కరికి కూడా పూర్తి స్థాయిలో సమాచారం అందించకుండా సభను నిర్వహిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం గత అక్టోబరులో ఉమెన్ హబ్ ఏర్పాటు చేయాలని నిధులు విడుదల చేసినా అధికారులు ఇప్పటి వరకు కార్యక్రమాలు నిర్వహించకపోవడం, లబ్ధిదారులకు వివరాలు చెప్పకపోవడం సరికాదన్నారు. ఆయాశాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో సమావేశాన్ని అర్థాంతరంగా ముగించారు. 11 గంటలకు ప్రారంభించాల్సిన సభకు 12 గంటల వరకు కూడా హాజరు కాకపోవడంతో ఎంపీపీ ఫోన్ కాల్‌తో అధికారులు, ఎంపీటీసీలు కొద్దిమంది హాజరు కాగా ప్రారంభించారు. జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, డీటీ నర్సయ్య సూపరింటెండెంట్ గోపాల్‌రావు, సీడీపీవో హైమావతి, అధికారులు పాల్గొన్నారు.

గంగారం భూగర్భంలో బొగ్గు!



తిరుమల గండి వద్ద వేసిన బోరు నుంచి వచ్చిన బొగ్గు

గంగారం, ఫిబ్రవరి 13 : మండలంలో రైతులు వారి పంటపొలాలలో సాగు కోసం బోర్లువేస్తే బొగ్గు రూపంలో నల్లగా బయటకు వస్తోంది. మండలంలోని దాదాపు పది పంచాయతీలలోని పలు గ్రామాలలో భూగర్భ పొరల్లో బొగ్గు నిక్షిప్తమై ఉందన్న చర్చజరుగుతుండటంతో రైతులు ఆశ్చర్యపోతున్నారు. బొగ్గుగనులకు నిలయమైన ఇల్లందు మండలానికి ఆనుకుని ఉన్న గంగారం అడవులలో అతివిలువైన నల్ల బంగారం ఉందని గిరిజనులు చెప్తున్నారు. అటు అటవీ అధికారులు కూడా వన్య ప్రాణులు తాగు నీటి కొరకు అడవుల్లో బోర్లు వేయగా పలుచోట్ల బొగ్గు వచ్చిందని తెలుస్తోంది. ఈ ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న అతివిలువైన బొగ్గుని వెలికి తీయటం వలన ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాం తం లో ఉన్న బొగ్గు నిక్షేపాలపై జియాలజికల్ సర్వే అధికారులతో సర్వే చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

- లక్ష్మాతండాలో ఘటన




కిషన్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి13 : కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ మండలం లక్ష్మాతండాలో మంగళవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. లక్ష్మాతండాకు చెందిన మూడు కిషన్ (40) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న పది గుంటల భూమిలో మిర్చితోట సాగు చేశాడు. గత కొద్దిరోజుల నుంచి భార్యాభర్తల మధ్య తరుచూ ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ప్రతిరోజు మద్యం ఎందుకు తాగి వస్తున్నావని భార్య మందలించడంతో క్షణకావేశానికి గురైన కిషన్ తన మిర్చితోట వద్ద సోమవారం సాయంత్రం పురుగుల మందుతాగాడు. గమనించిన పక్కపొలం రైతు వెంటనే కిషన్ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్సఅనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున కిషన్ మృతి చెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో, డీసీఎం ఢీ : ఒకరి మృతి

నెల్లికుదురు, ఫిబ్రవరి 13 : ఆటో డీసీఎం ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన నెల్లికుదురులోని క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగింది, స్థానికుల కథనం ప్రకారం. తొర్రూరు నుంచి నెల్లికుదురు వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను నెల్లికుదురు నుంచి తొర్రూరు వైపునకు వెళ్లుతున్న డీసీఎం ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 55ఏళ్ల గుర్తుతెలియనివ్యక్తి మృతి చెందగా, ఇద్దరికి త్రీవగాయాలు కావడంతో 108లోమానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియవల్సి ఉంది.



13 మంది ఏసీపీల బదిలీ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 13 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఏసీపీలతో పాటు ఇతర జిల్లాలలో డీఎస్పీలుగా పని చేస్తున్న వారిని కమిషనరేట్‌కు కేటాయిస్తూ రాష్ట డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 13 మందికి బదిలీ, పోస్టింగ్‌లు కల్పించారు. పోస్టింగ్‌లు పొందిన అధికారులు బుధవారం బాధ్యతలు చేపడుతారు. బదిలీ, పోస్టింగ్‌లు పొందిన వారిలో హనుమకొండ ఏసీపీగా దేవేందర్‌రెడ్డి, హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీగా తిరుమల్, నర్సంపేట ఏసీపీగా కిరణ్‌కుమార్, మామునూరు ఏసీపీగా రహమాన్, వర్ధన్నపేట ఏసీపీగా అంబటి నర్సయ్య, పాల్వంచ డీఎస్పీగా ఆదినారాయణ, జనగామ ఏసీపీగా దామోదర్ రెడ్డి, భూపాలపల్లి డీఎస్పీగా సంపత్‌రావు, రామగుండం సీసీఎస్ ఏసీపీగా బోజరాజు, మహబూబాబాద్ డీఎస్పీ గా తిరుపతిరావు, హుజూరాబాద్ ఏసీపీగా శ్రీనివాస్‌జీ, కరీంనగర్ పీటీసీ ఏసీపీగా డేవిడ్‌రాజులను నియమించారు. నేడో, రేపో మరికొంత మంది ఏసీపీలు, డీఎస్పీల బదిలీలు జరుగనున్నాయి. మంగళవారం కావడంతో పోస్టింగ్‌లు పొందిన వారు విధుల్లో చేరడానికి వెనుకంజ వేశారు. బుధవారం విధుల్లో చేరుతామని కమిషనరేట్‌కు వస్తున్న ఏసీపీలు వెల్లడించారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో సిలార్ సాహెబ్

తొర్రూరు, ఫిబ్రవరి 13 : తొర్రూరు ఎంపీడీవోగా ఎస్‌కే.సిలార్ సాహెబ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎంపీడీవో ఎస్.కుమార్ ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు. ఖమ్మం జిల్లా కూసుమంచి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌కే. సిలార్ సాహెబ్ ఎంపీడీవోగా బదిలీపైరాగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గార్లలో మంగమ్మ..

గార్ల : మండల అభివృద్ధి అధికారిగా ఎం.మంగమ్మ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవోల బదిలీల్లో భాగంగా గార్లలో పని చేసిన జి.రవీందర్‌ను ఖమ్మం జిల్లా కేంద్రానికి బదిలీ చేయగా భద్రాద్రి కొత్తగూడెం చుంచుపల్లి మండల ఎంపీడీవోగా పని చేసిన ఎం.మంగమ్మను బదిలీపై వచ్చారు. దింతో మంగళవారం ఉద్యోగ బాధ్యలు చేపట్టారు.

మైనార్టీలపై జరుగుతున్న వివక్షకు నిరసనగా

కోఆప్షన్ సభ్యత్వానికి అనితారాణి రాజీనామా

మహబూబాబాద్ టౌన్ ఫిబ్రవరి13 : మానుకోట మునిసిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు అనితారాణి మంగళవారం తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ పత్రాన్ని మానుకోటలోని మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసన్నారాణికి అందించారు. ఈ సందర్భంగా అనితరాణి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆశీస్సులతో క్రిస్టియన్ మైనార్టీ కోఆప్షన్ సభ్యురాలిగా తనను నియమించారని చెప్పారు. పాలకమండలిలో మైనార్టీలకు సరైన ప్రాధాన్యత, నిధుల కేటాయింపుల్లో జాప్యం చేస్తున్నందున తన పదవీకి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. మైనార్టీలకు పెద్దపీఠ వేసి, సముచిత స్థానం కల్పించిన మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మునిసిపల్ వైస్‌చైర్మన్ ఎండీ. ఫరీద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల మైనార్టీల ఎదుగుదలను చూసి ఓర్వలేక జరుగుతున్న పరిణామాలకు నిరసనగా తన పదవీకి స్వచ్ఛంద రాజీనామా చేస్తున్నట్లు అనితరాణి ప్రకటించారు.

రాష్ట్రస్థాయికి ఆరు ఇన్‌స్పైర్ నమూనాల ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13 : రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు మహబూబాబాద్ జిల్లా నుంచి ఆరు ఎగ్జిబిట్లు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు మంగళవారం తెలిపారు. 2022-23 విద్యాసంవత్సరానికి గాను ఆన్‌లైన్‌లో ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసిన 65 ప్రాజెక్టులను ఈనెల 9న నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రదర్శించగా అందులో 6 రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. డోర్నకల్ నిర్మల్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి పి.నిఖిల్, గూడూరు అరబిందో విద్యాలయ 9వ తరగతి విద్యార్థిని ఐశ్వర్య, మానుకోట మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి రాందీక్షిత్, డోర్నకల్ మండలం ముల్కలపల్లి జడ్పీహెచ్‌ఎస్ 8వ తరగతి విద్యార్థి జె.గోపిచంద్, మరిపెడ మండలం ఎల్లంపేట జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని భానుప్రియ, పెద్దవంగర మండలం గండ్లకుంట ఎంపీయూపీఎస్ విద్యార్థి కార్తీక్‌ల ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, ఏడీ రాజేష్, ఏసీజీఈ శ్రీరాములు, ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, సతీష్ అభినందించారు.

'ఆంగ్లంపై ఆసక్తిని పెంచేలా బోధన చేయాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి13 : ఆంగ్లంపై విద్యార్థులు ఆసక్తిని పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా)ఆధ్వర్యంలో జిల్లాస్థాయి స్పెల్‌విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. ఈపోటీల ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ ఆంగ్లభాష నేర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని, కష్టంతో కాకుండా ఇష్టంతో నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. నాన్ రెసిడెన్షియల్ విభాగం నుంచి స్పెల్ విజార్డ్ విభాగంలో గూడూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి దేవేందర్ ప్రథమ స్థానం, రెసిడెన్షియల్ విభాగం నుంచి ఇనుగుర్తి మోడల్ స్కూల్ విద్యార్థి ఇమామ్ ప్రథమ స్థానంలో నిలిచారని ఎల్టా జిల్లా అధ్యక్షుడు బ్రహ్మం తెలిపారు. రెసిడెన్షియల్ విభాగం నుంచి డ్రామాలో మానుకోట మోడల్ స్కూల్‌టీం, నాన్ రెసిడెన్షియల్ విభాగంలో కురవి మండలం జడ్పీహెచ్ఎస్ టీంలు ప్రథమ స్థానంలో నిలిచాయని పేర్కొన్నారు. అనంతరం ఈ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన టీంలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్టా బాధ్యులు రామ్మోహన్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ

కేసముద్రం, ఫిబ్రవరి 13 : కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో, మార్కెట్‌లో వేర్వేరుగా ఇఫ్టూ ఆధ్వర్యంలో మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హలావత్ లింగన్న, పిన్నోజు చంద్రమౌళి, చిట్టిమల్ల అశోక్, అన్నారపు హనుమంతు, బంటు వీరన్న, సుధాకర్, మరో కార్యక్రమంలో మిట్టగడుపుల వెంకన్న, భట్టు నాగేశ్వర్‌రావు, బండి రాజు సిట్ల సంజీవ పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణలో జల్లె జయరాజు, బోళ్ల రాములు, బూర యాకలక్ష్మి పాల్గొన్నారు.

మహిళపై లైంగిక దాడి

- నిందితుడి అరెస్టు

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 13 : మహిళపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. డోర్నకల్‌లో మంగళవారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలానికి చెందిన ఓ వివాహిత (40)ను డోర్నకల్ మండలం తెల్లబండా తండాకు చెందిన సురేష్ అనేవ్యక్తి ఖమ్మంలో ఆమెకుపరిచయమయ్యాడు. ఆదివారం రాత్రి మహిళతో తాను డోర్నకల్‌కు వెళ్తున్నాని చెప్పి, సురేష్ తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకున్నాడు. వెన్నారం దాటిన తర్వాత వాహనాన్ని వేరే దారివైపు మళ్లించాడు. దీంతో మహిళ డోర్నకల్ దారి ఇది కాదా? అని ప్రశ్నించింది. వెన్నారం-బూరుగుపాడు మధ్య నిర్మానుష ప్రదేశంలోకి మహిళను తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో మహిళ జరిగిన ఘటనపై డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుతో సోమవారం రాత్రి కేసు నమోదు చేసి, మంగళవారం సురేష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.

'రైతుల హామీలను నెరవేర్చాలి'

తొర్రూరు, ఫిబ్రవరి 13 : ప్రధాని మోదీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిపట్ల అమానుషంగా వ్యవహరించడం సరికాదని, వెంటనే హామీలను అమలు చేయాలని వామపక్ష పార్టీల రైతు సంఘంనాయకులు అన్నారు. కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తొర్రూరులో మంగళవారం భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకుడు తమ్మెర విశ్వేశ్వరరావు మాట్లాడారు. గత ఉద్యమంలో ప్రధాని మోదీ దేశ ప్రజలకు రాసి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని నిరసనగా రైతులు ఢిల్లీకి తరలివస్తుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. రైతు నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, పంటలకు గిట్టుబాటు ధర చట్టం తేవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘాల నాయకులు కొత్తపల్లి రవి, బొల్లం అశోక్, సాయిలు, వీరన్న, భిక్షపతి, యాకూబ్, రాములు, లింగయ్య, సోమిరెడ్డి, యాకయ్య లక్ష్మణ్, దర్గయ్య, సాయిమల్లు పాల్గొన్నారు.

భారత్‌బంద్‌ను సక్సెస్ చేయండి

ఇనుగుర్తి, ఫిబ్రవరి 13 : ఈనెల 16 జరిగే దేశవ్యాప్త గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ పిలుపునిచ్చారు. ఇనుగుర్తి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. యాకమ్మ, పార్వతమ్మ, సుగుణ, ఎల్లమ్మ, ఉమ, ఎల్లయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల కుటుంబాలకు సాయం

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి13 : అమ్మాపురం గ్రామం చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన విషయం విదితమే. అయితే స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో ఉపాధ్యాయులు మంగళవారం ఆర్థిక సహాయం చేశారు. జంపా కుటుంబానికి ఉపాధ్యాయులు రూ.10వేల నగదు, క్వింటా బియ్యం అందజేసి చేయూతనిచ్చారు. అలాగే ఉన్నత పాఠశాలలో చదువుతున్న గందం యాకూబ్ కుటుంబానికి హెచ్‌ఎం తుమ్మ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం రూ.13వేలు అందజేశారు. హెచ్‌ఎంలు తుమ్మ వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, ఉపాధ్యాయులు హరికృష్ణచారి, వెంకన్న, రత్నశేఖర్, శ్రీనివాస్, రమేష్, లక్ష్మయ్య, ధనలక్ష్మి, మంజుల, తస్లీమా, విజయ, కళ్యాణి, సుగుణమ్మ, హేమలత, యాకూబి పాల్గొన్నారు.

రేపటిలోపు గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోండి : ఏఈ

కురవి, ఫిబ్రవరి 13 : మండలంలో ఈనెల 15లోపు గృహజ్యోతి 200 యూనిట్ల సబ్సిడీ కొరకు విద్యుత్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈ శారద తెలిపారు. మండలంలో మంగళవారం గృహజ్యోతి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ లబ్ధిదారులు ఆధార్‌కార్డు నెంబర్, రేషన్‌కార్డు నెంబర్, ప్రజాపాలన దరఖాస్తు నెంబర్, ఫోన్ నెంబర్ సమాచారం అందించాలన్నారు. అధికారులు జంపిరావు, వెంకటేష్, సిద్ధు, రాజు పాల్గొన్నారు.

మేడారం జాతర కమిటీ సభ్యుడిగా అశోక్



గంగారం, ఫిబ్రవరి 13 : మేడారం జాతర ఉత్సవ కమిటీ మెంబర్‌గా మావోయిస్టు అగ్రనేత హరిభూషన్ సోదరుడు యాప అశోక్ ఎంపిక అయ్యారు. మడగూడ గ్రామానికి చెందిన యాప అశోక్ న్యాయవిద్యలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అశోక్ ఎంపికకు కృషి చేసిన మంత్రి సీతక్కకు అశోక్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కమిటీ మెంబర్‌గా అశోక్ ఎంపిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరిపెడ మునిసిపల్ కమిషనర్ బదిలీ

మరిపెడ, ఫిబ్రవరి 13 : మరిపెడ మునిసిపల్ కమిషనర్ ఎ.రాజు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మునిసిపాలిటీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రభుత్వం ఇంకా ఎవరినీ భర్తీ చేయలేదు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సీఈసీ సూచనతో రాష్ట్ర మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ మంగళవారం మరిపెడ కమిషనర్ రాజును బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దాతృత్వాన్ని చాటుకున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్

- ఆకలిని తీర్చేందుకు వానరాలకు అరటిపండ్లు అందజేత



వానరాలకు అరటిపండ్లను అందిస్తున్న తస్లీమా మహ్మద్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 13 : రోడ్డు వెంట ఆకలితో అలమటిస్తున్న వానరాల (కోతులు)నుచూసి మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమామహ్మద్ చలించిపోయారు. వెంటనేఅరటిపండ్లను కొనుగోలు చేసి తన చేతుల మీదుగా వానరాలకు అందించి వాటి ఆకలిని తీర్చిదాతృత్వాన్ని చాటుకున్నారు. పట్టణ శివార్లలో మంగళవారం ఆకలి కోసం అలమటిస్తున్న వానరసైన్యాన్ని చూసి సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ వాటిని ఆకలి తీర్చాలనుకున్నారు. వెంటనే అరటి పండ్లను కొనుగోలు చేసి అక్కడికి వెళ్లి తాను స్వయంగా కోతులకు అందించి వాటి ఆకలిని తీర్చారు. మూగ జీవాల ఆకలిని తీర్చడం ఎంతో ఆనందంగా ఉందని సబ్‌రిజిస్ట్రార్ అన్నారు. చెట్లు లేకకోతులు, పక్షులు ఆహారం దొరక్క విలవిలలాడుతున్నాయని ఆకలితో అలమటిస్తూ రోడ్లపై తిరుగుతున్న మూగజీవాల ఆకలినీర్చి మానవత్వం చాటుకోవాలని ఆమె కోరారు.